ఆంధ్రజ్యోతి


5

ANDHRAJYOTHY
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 12 ఏప్రిల్ 2024

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	39.0 24.0	38.0 24.0	39.0 25.0	38.0 24.0	38.0 23.0

ఘనంగా ఈదుల్ ఫితర్





హిందూపురంలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు, సందేశమిస్తున్న మౌలానా మన్నాన్

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 11: ముస్లింల పవిత్ర పర్వదినం ఈదుల్ ఫితర్‌ను జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా చేసుకున్నారు. రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించారు. బుధవారం నెల వంక దర్శనంతో గురువారం జిల్లావ్యాప్తంగా పర్వ దినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే మసీదులకు చేరుకుని, వజూ నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా ఈద్గా మైదానాలకు చేరుకున్నారు. సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువులు.. మహమ్మద్ ప్రవక్త మానవాళికి అందించిన సందేశాన్ని వినిపించారు. అనంతరం సర్వమానవాళికి శుభాలు ప్రసాదించాలని అల్లాను దువా చేశారు. సామూహికప్రార్థనల అనంతరం పరస్పరం ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని, ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. ఈసందర్భంగా పెద్దఎత్తున హిందువులు.. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డులేక ఎన్నేళ్లిలా?

ఆగ్రహించిన తండావాసులు

రహదారిపై ధర్నా
వంటావార్పుతో నిరసన



రోడ్డుపై బైఠాయించిన తండావాసులు



రోడ్డుపైనే వంటావార్పు చేస్తూ..

తండా వాసులతో చర్చిస్తున్న డీటీ, సీఐ

మడకశిర రూరల్, ఏప్రిల్ 11: రోడ్డు కోసం మండలంలోని గుర్రపుకొండ తండావాసులు ఆందోళనకు దిగారు. తండాకు రోడ్డులేకుండా ఎన్నేళ్లిలా అవస్థలు పడాలంటూ మండిపడ్డారు. వెంటనే రహదారి నిర్మించాలంటూ గిరిజనులు గురువారం గ్రామ సమీపంలో కదిరేపల్లి-గుర్రపుకొండ రోడ్డుపై ధర్నా చేపట్టారు. రోడ్డుపైనే వంటావార్పు చేసి, నిరసన తెలిపారు. తండావాసులు మాట్లాడుతూ.. తండా ఏర్పడిన నాటి నుంచి రహదారి లేదన్నారు. రైతు పొలాల గుండానే తండాకు వెళ్తున్నామన్నారు. గ్రామానికి రోడ్డు నిర్మించాలని అనేకసార్లు ధర్నాలు చేసి, అధికారులకు వినతిపత్రాలు కూడా ఇచ్చామన్నారు. వారు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం రైతులు తమ పొలాల చుట్టూ కంచె వేస్తుండడంతో తండాకు వెళ్లడానికి దారిలేకుండా పోయిందన్నారు. అధికారులు తమ తండాకు దారి చూపించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు, సీఐ మనోహర్ అక్కడికి వెళ్లి, గిరిజనులతో చర్చించారు. తండాకు పొలాల్లోనే రోడ్డు వేయిస్తామనీ, అందరూ రెండ్రోజుల్లోగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి, నిర్ణయం తెలపాలని కోరారు. దీంతో వారు శాంతించి, వెళ్లిపోయారు.

అడిగేవారెవరని..?

వైసీపీ నాయకుల జలచౌర్యం

తాగునీరు పక్కదారి





సత్యసాయి తాగునీటి పథకం నుంచి వైసీపీకి చెందిన రాజమహల్‌కు వేసిన పైపులైన్

పుట్టపర్తి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి తాగునీటి పథకం పైపులైన్ నుంచి అడుగడుగునా నీటి చౌర్యం చేస్తున్నారు. అధికార పార్టీ అండతో నేరుగా పైపులైన్ నుంచి జలచౌర్యానికి పాల్పడుతున్నారు. అడ్డంగా దొరికినా అధికారులు చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారు. ప్రజలకు జవాబుదారీగా నిలవాల్సిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఏకంగా సత్యసాయి తాగునీటి పథకం ప్రధాన పైపులైన్ నుంచి చాటుగా నల్లమాడ మండలం నల్లసింగయ్యగారిపల్లి వద్ద వ్యవసాయ తోటకు నాలుగున్నరేళ్లుగా నీటిని మళ్లించిన సంగతి వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే నీటి చౌర్యంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. గ్రామీణ నీటి సరఫరా అధికారులు శ్రీసత్యసాయి తాగునీటి పథకం నుంచి తోటకు ఏర్పాటు చేసిన పైపులైన్‌ను తొలగించి, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని నల్లమాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక.. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎక్కడ పడితే అక్కడ పైపులైన్ నుంచి నేరుగా కనెక్షన్లు తీసుకున్న వైనం వెలుగుచూస్తోంది. పుట్టపర్తికి వెళ్లే పైపులైన్‌కు ఎనుములపల్లి గణేష్ సర్కిల్ సమీపాన 2019 డిసెంబరులో వైసీపీకి చెందిన ఓ రాజమహల్‌కు నేరుగా పైపులైన్ వేసుకున్నారు. కొందరు ఉద్యోగులు దగ్గరుండి పైపులైన్ అప్పట్లో ఏర్పాటు వేయించినట్లు విమర్శలున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి బీడుపల్లికి వెళ్లే తాగునీటి పథకం నుంచి ఓ విద్యాసంస్థకు నేరుగా పైపులైన్ ఏర్పాటు చేసుకున్నారు. వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడితో పైపులైన్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇలా.. చాలాచోట్ల ప్రధాన పైపులైన్ నుంచి నేరుగా నీటి చౌర్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. తీవ్ర వర్షాభావంతో పట్టణ, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఈనేపథ్యంలో అధికారం ఉందనీ, తమకు అడ్డు చెప్పేవారెవరన్న ధోరణితో బరితెగించి కొందరు వైసీపీ నేతలు సత్యసాయి తాగునీటి పథకం నీటిని అక్రమంగా తోట, రాజమహల్‌కు మళ్లించినట్లు తెలుస్తోంది. విషయం తెలిసినా అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి చర్యలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలున్నాయి. ఈనేపథ్యంలో సత్యసాయి తాగునీటి పథకం నుంచి నీటిచౌర్యం చేస్తున్న వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





టీడీపీ హయాంలో పరిశ్రమల క్యూ

కియ రాకతో ఆటోమొబైల్ హబ్‌గా పెనుకొండ

తిరోగమనం..!



- మరిన్ని ఏర్పాటుకు స్థలాల సేకరణ
- వైసీపీ వచ్చాక అంతా రివర్స్
- సిద్ధంగా ఉన్న పరిశ్రమలూ తిరుగుటపా
- ఐదేళ్లలో ఒక్కటీ ఏర్పాటుకాని దుస్థితి



కప్పలబండ పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటుకాక ఖాళీగా ఉన్న ప్లాట్లు

పుట్టపర్తి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): టీడీపీ 2014లో అధికారం చేపట్టాక ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పట్టాలెక్కింది. కరువు సీమలో కృష్ణాజలాలు పారించి, పరిశ్రమలు ఏర్పాటు చేయించేందుకు అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు అవిశ్రాంతంగా కృషి చేశారు. అంతర్జాతీయ కార్ల దిగ్గజం కియను పెనుకొండకు రప్పించారు. అనుబంధ పరిశ్రమలు క్యూ కట్టాయి. నెలల వ్యవధిలో పెద్దసంఖ్యలో ఏర్పాటయ్యాయి. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కియ, కేంద్ర సంస్థలకు అనుబంధంగా ఏర్పాటుకు మరిన్ని పరిశ్రమలు క్యూలో నిల్చున్నాయి. ఇక.. జిల్లా మొత్తం పారిశ్రామిక హబ్‌గా మారుతుందనీ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదువ ఉండదని అందరూ ఆశించారు. ఈ తరుణంలో పాలకపక్షం మారింది. వైసీపీ అధికారం చేపట్టింది. పరిశ్రమలపై వేధింపులు మొదలయ్యాయన్న ఆరోపణలు వినిపించాయి. దీంతో ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు మళ్లాయి. ఇక్కడ ఏర్పాటు చేయలేమంటూ పారిశ్రామిక వేత్తలు వెళ్లిపోయారు. దీంతో ఒక్కసారిగా పారిశ్రామిక ప్రగతి తిరోగమనం బాటపట్టింది. వైసీపీ ఐదేళ్ల పాలన మొత్తంగా జిల్లాలో ఒక్కటంటే ఒక్క చెప్పుకోదగ్గ పరిశ్రమ ఏర్పాటు కాకపోవడం శోచనీయం. సీఎం జగన్ మాత్రం ఉత్తుత్తి శంకుస్థాపనలతో హడావుడి చేశారు. అక్కడితో అన్నీ ఆగిపోయాయి. అడుగు ముందుకు పడలేదు. ఈ దుస్థితిపై జిల్లావాసులు ఆవేదన చెందుతున్నారు.

హామీల గారడీ

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 పేరుతో విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడుల ఆకర్షణ సదస్సులో 13 లక్షలకోట్లకుపైగా పెట్టుబడులు ఇచ్చాయని సీఎం జగన్ గొప్పలు చెప్పారు. జిల్లాలో పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. జిల్లాకు పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వస్తాయనీ, ఆ మేరకు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదిరాయని ప్రకటించారు. గతేడాది జిల్లాలో పలు పరిశ్రమలకు శంకుస్థాపన చేసి, ఊదరగొడితే జనం నమ్మారు. ముఖ్యమంత్రి హోదాలో ఏపని చేపట్టినా, ఏ శిలాఫలకం వేసినా నెరవేరుతుందని ప్రజల నమ్మకం. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, వేలాది మందికి ఉపాధి కల్పిస్తామంటూ శిలాఫలకాలు వేసి, హామీల గారడీ చేశారు. శంకుస్థాపనలతో సరిపెట్టారు. ఒక్క పరిశ్రమ కూడా ముందుకు సాగక అటకెక్కాయి. స్వయానా సీఎం శంకుస్థాపన చేసిన పరిశ్రమలకే దిక్కులేకుండా పోయింది. మళ్లీ ఎన్నికలు రానే వచ్చాయి. ఇచ్చిన హామీలు, చేసిన శంకుస్థాపనలు, చెప్పిన గొప్పలు గుర్తున్నాయా జగన్ అంటూ జిల్లా ప్రజానీకం ప్రశ్నిస్తోంది.

శంకుస్థాపనల డప్పు..

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు పేరుతో గతేడాది సీఎం జగన్ హడావుడిగా వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, శిలాఫలకాలను ఆవిష్కరించారు. తొలి నాలుగేళ్లలో ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాని జగన్ పారిశ్రామికాభివృద్ధి డ్రామా పేరుతో గతేడాది అక్టోబరు 4న మూడు పరిశ్రమలకు భూమిపూజ చేసి, జనాన్ని నమ్మించే ప్రయత్నం చేశారు. వర్చువల్‌గా కదిరి మండలం పట్నంలో రూ.4.41 కోట్లతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్, సోమందేపల్లి మండలం గుడిపల్లి వద్ద రూ.125 కోట్లతో యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటోమేటివ్ ప్లాస్టిక్ ప్రైవేట్ కంపెనీ, మడకశిర మండలం ఆర్ అనంతపురం వద్ద రూ.250 కోట్లతో ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్ కంపెనీల పనులకు సీఎం భూమి పూజ చేశారు. ఈ మూడు పరిశ్రమలు ఏడాదిలో ఉత్పత్తి ప్రారంభిస్తాయనీ, ప్రత్యక్షంగా 1370 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని జిల్లాలో కీలక అడుగు పడిందని ఆర్భాటంగా ప్రకటించారు. నెలతిరక్క ముందే నవంబరు 30న పుట్టపర్తి జిల్లా కేంద్రం పరిధి కప్పలబండ పారిశ్రామిక వాడలో రూ.11.71 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, హిందూపురం పారిశ్రామిక వాడలో రూ7.15 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేశారు. పారిశ్రామిక వాడల్లో సూక్ష్మ, చిన్నతరహా సంస్థల అభివృద్ధి కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వివిధ కంపెనీల ఏర్పాటుకు ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. ఈ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వర్చువల్‌గా శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక.. 1500కిపైగా ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు చేసి, పదివేల మందికిపైగా ఉద్యోగాలు కల్పించినట్లు ప్రభుత్వం చెబుతోంది. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి ప్రకటనలకే పరిమితమైందనీ, చెప్పుకోదగ్గ ఒక్క కొత్త పరిశ్రమ కూడా ఏర్పాటైంది లేదన్నది బహిరంగ రహస్యమే. కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించిందీ లేదు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా హిందూపురం మండలం తూమకుంట వద్ద పారిశ్రామిక వాడకు 38 ఏళ్ల కిందటే ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. టీడీపీ హయాంలో జిల్లా వ్యాప్తంగా పారిశ్రామికాభివృద్ధికి వేలాది ఎకరాల భూములు సేకరించారు. 2017లో పెనుకొండ వద్ద కియ కార్ల పరిశ్రమ రాకతో పారిశ్రామిక కారిడార్‌లోకి వచ్చింది. గుడిపల్లి వద్ద కియ అనుబంధ సంస్థలు, గోళ్లాపురం, ఎర్రమంచి, రాళ్లఅనంతపురం, కొటిపి, కదిరి కుటాగుళ్ల, శెట్టిపల్లి, దాదులూరు, కేతగానిచెరువు, కప్పలబండ వద్ద పారిశ్రామిక పార్కులకు భూములు సేకరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ భూముల్లో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు.



సీఎం వర్చువల్‌గా నిర్వహించిన పరిశ్రమల శంకుస్థాపనకు హాజరైన జిల్లా అధికారులు (ఫైల్)

ఒక్కటీ లేదు..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రకటలే తప్ప.. జిల్లాలో ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటైంది లేదు. కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించిందీ లేదు. జిల్లాలో ఎక్కడ ఫలానా కొత్త పరిశ్రమ ఏర్పాటు చేశారో ప్రభుత్వం చెప్పుకునే పరిస్థితి కన్పించలేదు. టీడీపీ హయాంలో కియ కార్ల పరిశ్రమ రాకతో ఆటోమొబైల్ హబ్‌గా విస్తరించింది. కియ పరిశ్రమతో పాటు అనుబంధ సంస్థల నిర్మాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేలమందికిపైగా ఉద్యోగ అవకాశాలు లభించాయి. కియ ల్యాండ్‌మార్కుగా మారింది. గోరంట్ల, సోమందేపల్లి, పాలసముంద్రం, గుడిపల్లి వద్ద 2015లో ప్రపంచంలోనే అత్యున్నత శ్రేణి నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఎక్సైజ్ నార్కొటిక్స్ (నాసెన్), భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ (బెల్) భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. నాసెన్‌ను ప్రధాని ప్రారంభించారు. కియ, అనుబంధ సంస్థలు, నాసెన్, బెల్ ఏర్పాటుతో గార్మెంట్స్ పరిశ్రమల రాకతో రైతు కుటుంబాలతోపాటు లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దక్కాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ కూడా తీసుకు వచ్చిందిలేదు. దీంతో జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు లేక వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.



మడకశిర మండలం ఆర్.అనంతపురం వద్ద ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్ కంపెనీకి కేటాయించిన భూమి



సచివాలయం ముందు ధర్నా చేపట్టిన కార్మికులు, దళిత నేతలు

పంచాయతీ కార్మికుల ఆగ్రహం

ఉపసర్పంచ్ తిట్ల దండకంపై నిరసన.. పోలీసు స్టేషన్, సచివాలయం ముందు ధర్నా

గోరంట్ల, ఏప్రిల్ 11: స్థానిక మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ రాజారెడ్డి.. పంచాయతీ ఎలక్ట్రీషియన్ వినోద్ లైటు వేయలేదని దుర్భాషలాడడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోరంట్ల మేజర్ పంచాయతీ కార్మికులు గురువారం పోలీసు స్టేషన్, సచివాలయం ముందు ధర్నా చేపట్టారు. పనులు ఆపేసి, మరీ ఆందోళనకి దిగారు. మండలంలోని వానవోలు గ్రామానికి ఎన్నికల ప్రచారానికి మంత్రి ఉషశ్రీ చరణ్ వస్తున్నారని తెలిసి ఆమెకు వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ముందుగానే విషయం తెలుసుకున్న మంత్రి ప్రధాన రహదారి గుండా కాకుండా సంతమార్కెట్ వీధి గుండా వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న కార్మికులు ధర్నా విరమించారు. సీఐ సుబ్బరాయుడుకు వినతిపత్రం అందించారు. పోలీసు స్టేషన్ నుంచి ప్రధాన రహదారిపై సచివాలయం-1 వరకు ర్యాలీ చేపట్టారు. సచివాలయం ముందు బైఠాయించి, దళితులపై దుర్భాషలాడిన ఉప సర్పంచ్ వెంటనే రాజీనామా చేయాలనీ, తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత నాయకులు సురేష్, నరసింహులు తదితరులు వారికి మద్దతు పలికారు. దళితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. రోజుకో విభాగం పనులు మానేసి, ఆందోళనలు ఉధృతం చేస్తామని పంచాయతీ మేస్త్రీ గణేష్ హెచ్చరించారు. ఉప సర్పంచ్ రాజారెడ్డిపై బాధితుడు వినోద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేత్రపర్వంగా లంకాదహనం



ఒంటె వాహనంపై స్వామివారు

గుంతకల్లు, ఏప్రిల్ 11: కసాపురం దేవస్థానంలో గురువారం రాత్రి లంకాదహన కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉగాది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వామివారికి వేకువనే అభిషేకాలు, అలంకారాలు చేశారు. అర్చనలు, పూజలు నిర్వహించి మధ్యాహ్నం మహా మంగళహారతిని ఇచ్చారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఒంటె వాహనంపై ఆశీనులనుగావించి అలంకారాలు చేశారు. ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి దక్షిణ గోపురం ఎదుట బయలు ప్రదేశంలో బాణా సంచాను పేల్చి లంకాదహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భద్రాజీ, ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కే సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, ప్రధాన అర్చకులు గరుడాచార్యులు, అనంతాచార్యులు, రాఘవాచార్యులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

మురడిలో ఘనంగా రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

డీ.హిరేహాళ్, ఏప్రిల్ 11: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మురడి ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా ఉగాది పండుగ సందర్భంగా రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. రథోత్సవం సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవతో స్వామివారికి పంచామృతాభిషేకం, వెండి కవచ స్వర్ణాభరకవచ, ఆకుపూజ, పవనామ మన్యు సూక్తం, రామా తారకహోమాలు తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంకాలం ఉత్సవమూర్తిని ఆలయం నుంచి అర్చకులు రథోత్సవం వద్దకు తీసుకువచ్చి రథోత్సవంలో ఉంచి ప్రోక్షణ బలిహరణ పూజలు నిర్వహించారు. భారీ భక్తజన సందోహం నడుమ రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంజూరుకాని డైట్ బిల్లులు

- పేద విద్యార్థుల పొట్టకొట్టిన వైసీపీ ప్రభుత్వం
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వార్డెన్లు
- ఏడు నెలలుగా అందని బిల్లులు
- రూ.40 కోట్ల బకాయిలు
- విద్యార్థులకు తప్పని ఆకలికేకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్



బీసీ సంక్షేమశాఖ కార్యాలయం

పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం.. వారి విద్యాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాం... వారికోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తాం... మీరు చేయవలసిందిల్లా ఒక్కటే.. మీ పిల్లలను సంక్షేమ వసతిగృహాల్లో చేర్పించండి.. అంతా మా ప్రభుత్వమే చూసుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు గొప్పలు పోయారు. క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి ఆ మాటలు ఒట్టి నీటిమూటలుగా మిగిలాయనడంలో ఎలాంటి సందేహం లేదు. పేద విద్యార్థులకు సకాలంలో అందించాల్సిన భోజనం విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. సకాలంలో డైట్ బిల్లులు విడుదల చేయకపోవడంతో ఐదేళ్లుగా విద్యార్థులకు ఆకలి కేకలు మిగిలాయి. రకరకాల సాకులతో ఐదేళ్లగా బిల్లులు పెండింగ్‌లో ఉంచడం... ఒకటి రెండు విడుదల చేయడం... నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందనే చెప్పాలి. దీనికితోడు మెనూ చార్జీలు పెంచినట్లు బూచి చూపి మెనూలో అదనపు పదార్థాలను చేర్చడం, సకాలంలో బిల్లులు మంజూరుకాక... వార్డెన్లపై ఆర్థికభారం వేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఏడు నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్ ఉండటంతో వార్డెన్లు అప్పులు చేసి మెనూ అమలు చేయాల్సిన దుస్థితిని నెలకొంది.

గోరంత పెంపు... అమలు అంతంతే..

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2023 సంవత్సరంలో డైట్ బిల్లులను కొద్దిమేర పెంచింది. విద్యార్థికి రూ. 150 నుంచి రూ. 200లు వరకే పెంచింది. పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో విద్యార్థులకు కేవలం రూ. 200లు పెంచి ఇడ్లీలు, పూరీలు, చికెన్ బిర్యానీ, పాలు, రకరకాల స్వీట్లు పెట్టాలని కొత్త మెనూ చేయడంతో ఆయా హాస్టల్స్ వార్డెన్లు ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ. 40 కోట్ల వరకు పెండింగ్

ఉమ్మడి అనంత జిల్లావ్యాప్తంగా సంక్షేమ వసతిగృహాలకు సంబంధించి దాదాపు ఏడు నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 40 కోట్ల వరకూ డైట్ బిల్లులు మంజూరు కావాల్సి ఉందని ఆయా సంక్షేమ వసతిగృహాల అధికారుల ద్వారా అందిన సమాచారం. అనంత జిల్లాలో 58 బీసీ హాస్టళ్లు ఉండగా 7329 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం డివిజన్లకు జనవరి నెల నుంచి డైట్ బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. తాడిపత్రి డివిజన్‌లో అయితే రకరకాల సాంకేతిక కారణాల వల్ల అక్టోబరు నుంచి బిల్లులు రావాల్సి ఉంది. మొత్తం జిల్లా అంతా కలిపి రూ.10 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. శ్రీసత్యసాయి జిల్లాలో 59 బీసీ హాస్టళ్లు ఉండగా... 5849 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇక్కడ కూడా కొన్నిచోట్ల సెప్టెంబరు, అక్టోబరు నుంచి బిల్లులు రావాల్సి ఉంది. ఇక్కడ కూడా రూ. 11 కోట్ల వరకూ పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక లెక్కలు చూపుతున్నాయి. అనంతపురం జిల్లాలో 58 ఎస్సీ హాస్టళ్లు ఉండగా 4927 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇక్కడ అక్టోబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్నింటికి మాత్రమే బడ్జెట్ రిలీజ్ చేయడం... మరికొన్నింటిని పెండింగ్‌లో ఉంచడంతో దాదాపు ఏడు నెలలుగా రూ. 8 కోట్ల వరకు బిల్లులు అందని పరిస్థితి ఉంది. శ్రీ సత్యసాయి జిల్లాలో 27 ఎస్సీ హాస్టళ్లు ఉండగా 1806 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇక్కడ వీరి పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. ఆరేడు హాస్టళ్లకు జూన్ నెల నుంచి బిల్లులు పడాల్సి ఉండగా మరికొన్ని చోట్ల జూలై నుంచి అంటే దాదాపు నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అన్ని కలిపితే దాదాపు రూ. 9 కోట్ల వరకూ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక గిరిజన సంక్షేమశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖలకు సంబంధించిన హాస్టళ్లకు సంబంధించి మరో రూ. 3 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

- తాడిపత్రి డివిజన్‌లోని ఓ ఎస్సీ వార్డెన్ అక్టోబరు నుంచి అప్పులు తెచ్చి డైట్ అమలు చేస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు రూ. 10 లక్షలు అప్పు చేసినట్లు చెప్పుకొచ్చాడు. ఈ నెల బిల్లులు రాకపోతే ఉద్యోగం వదిలేయాలనుకుంటున్నానని తెలిపారు.
- కళ్యాణదుర్గం డివిజన్‌లో ఓ బీసీ వార్డెన్ నాలుగు నెలలుగా అప్పు తెచ్చి మెనూ అమలు చేస్తున్నాడు. రూ. 6 లక్షలు అప్పు తెచ్చి విద్యార్థులకు మెనూ అమలు చేశాడు. ఈ నెల ముగిస్తే.. వచ్చే నెల ఎన్నికలు... తరువాత పరిస్థితి ఏంటో అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.
- ధర్మవరం డివిజన్‌లో ఓ బీసీ వార్డెన్ ఐదు నెలలుగా డైట్ బిల్లులు రాకపోవడంతో అప్పు తెచ్చి మెనూ అమలు చేస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. దాదాపు రూ. 7 లక్షలు అప్పు చేసినట్లు తెలిపారు. ఈ నెలకు సంబంధించి డబ్బులు లేకపోవడంతో తన భార్య నక్లెస్ బ్యాంకులో లోన్ పెట్టి రూ.80 వేలు తెచ్చుకున్నానని, ఆ డబ్బుతో పిల్లలకు మెనూ అమలు చేస్తానన్నాడు.



సంక్షేమ హాస్టళ్లను నిర్వీర్యం చేసేశారు

విద్యార్థులకందించే భోజనం విషయంలో ప్రభుత్వం వివక్షత చూపడం బాధాకరం. డైట్ బిల్లులు సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించారు. ఈ పాపం ఊరికే పోదు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు ప్రజలు సరైన బుద్ధి చెప్తారు.

-సాకే నరేష్, బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు



విద్యార్థుల పాలిట కంసమామగా మారిన జగన్

డైట్ బిల్లులు విడుదల చేయకపోవడంతో వార్డెన్లు అప్పులు తెచ్చి మెనూ అమలు చేస్తున్నారు. బిల్లులు విడదల చేయాలని పోరాటాలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. విద్యార్థుల పాలిట జగన్ కంసమామగా మారిపోయాడు. త్వరలో జరిగే ఎన్నికల్లో అందరూ ఏకతాటిపైకి వచ్చి జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి.

-కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

గోరంట్ల, ఏప్రిల్ 11: మండలంలోని గౌనివారిపల్లిలో టీడీపీకి చెందిన దళిత దంపతులు లక్ష్మీనర్సప్ప, నాగమణిపై జరిగిన దాడికి సంబంధించి నలుగురు వైసీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును గురువారం నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామస్థులు పార్వేట ఉత్సవం నిర్వహిస్తుండగా కుందేలు పెట్టెను తాకినందుకు దళితుడైన లక్ష్మీనర్సప్పతో వైసీపీ నాయకులు ఘర్షణ పడి దాడి చేసిన విషయం తెలిసిందే. గాయపడిన లక్ష్మీనర్సప్ప హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనను కులం పేరుతో దూషించి, కట్టెలు, ఇటుక పెళ్లలతో దాడిచేసినట్లు ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో డీలర్ నారాయణ, వలంటీర్ హరిక్రిష్ణ, సాయిక్రిష్ణ, రామచంద్రపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉప సర్పంచ్ రాజారెడ్డిపై...

గోరంట్ల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ రాజారెడ్డిపై పంచాయతీ దళిత ఉద్యోగి వినోద్‌ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు గురువారం నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గోరంట్లలోని రెడ్డివారివీధిలో వీధి లైటు ఏర్పాటు చేసే విషయమై ఎలక్ట్రీషియన్ వినోద్‌ను ఉప సర్పంచ్ రాజారెడ్డి దుర్భాలాడిన విషయం తెలిసిందే. దీనిపై పంచాయతీ కార్మికులు. దళిత సంఘం నాయకులు గురువారం పోలీస్‌స్టేషన్, పంచాయతీ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. వినోద్‌ను కులంపేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదు చేయడంతో ఉప సర్పంచ్ రాజారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అరాచక శక్తులను ప్రకాష్‌రెడ్డి పెంచి పోషిస్తున్నారు

- రాప్తాడు ఎమ్మెల్యేపై మాజీ మంత్రి పరిటాల సునీత ఫైర్
- బండి రవి దాడిలో గాయపడ్డవారికి పరామర్శ



టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న పరిటాల సునీత

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11: అరాచకశక్తులను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పెంచి పోషిస్తున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. వైసీపీ గూండా బండిరవి దాడితో తీవ్రంగా గాడపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త శివయాదవ్‌తోపాటు మరో కార్యకర్తను పరిటాల సునీత గురువారం రాత్రి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాప్తాడు జరిగిన వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ అల్లరి మూక బండిరవికి మొన్నటి వరకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రక్షణ ఇచ్చాడన్నారు. బెయిల్‌పై వచ్చాక సొంత గ్రామానికి పంపగా మరోసారి తన క్రూరత్వాన్ని బయటపెట్టాడన్నారు. కనగానపల్లి మండలం కోనాపురంలో టీడీపీ కార్యకర్తలపై అకారణంగా దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ అరాచకాలు ఇంకా తగ్గలేదన్నారు. ఫోటోగ్రాఫర్‌పై దాడి చేసిన రౌడీని బయటికి వదిలి టీడీపీ కార్యకర్తలపై ఇలా దాడులు చేయిస్తారా అని మండిపడ్డారు. ఈ ఘటనపై ప్రకాష్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ కార్యకర్తల జోలికివస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఇలాంటి దాడులు జరుగుతున్నా పోలీసులు, ఎన్నికల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన వైసీపీ గూండాపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో మృతి



లాల్‌బాషా

కణేకల్లు, ఏప్రిల్ 11: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. మండలంలోని సొల్లాపురం గ్రామానికి చెందిన దూదేకుల లాల్‌బాషా(30) గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. రంజాన్ సందర్భంగా సాయంత్రం మసీదుకు ప్రార్థన నిమిత్తం వెళ్లాడు. కాళ్లు, చేతులు కడుక్కుని పక్కనే ఉన్న విద్యుత్‌వైర్‌ను పొరపాటున తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

చీనీ కాయలు టన్ను రూ.38వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 11: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.38వేలు, కనిష్ఠంగా రూ.15,500లు, సరాసరి రూ.22వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 219టన్నులు వచ్చాయన్నారు.

మూగజీవికి నీటి కష్టం

- మురుగునీటిని తాపుతున్న కాపరులు
- చెరువు నీటిని వదిలి ఆదుకోవాలని వినతి
- శింగనమల మండలంలో దారుణ పరిస్థితులు



మురుగునీటిని తాగుతున్న గొర్రెలు

శింగనమల ఏప్రిల్ 11: మండు వేసవిలో గుక్కెడు నీరు దొరక్క మూగ జీవాలు అల్లాడి పోతున్నాయి. అడవికి మేతకు వెళ్లే పశువులు, గొర్రెలు నీరు దొరక్క.. అక్కడక్కడ కనిపించే మురుగు నీటిని తాగుతున్నాయి. శింగనమల చెరువు పరిసర ప్రాంతాల్లోని పది గ్రామాలలో లక్షకు పైగా మూగ జీవాలు ఉన్నాయి. చెరువు నీటిని అప్పుడప్పుడు కాలువకు వదిలితే పశువులు, గొర్రెలకు తాగునీటి సమస్య ఉండదు. నీటిని వదలాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గొర్రెల కాపరులు వాపోతున్నారు. శింగనమల చెరువు నీటిని అనుమతి లేకుండా అనంతపురం-తాడిపత్రి హైవే పనులకు వాడుకున్నారు. ఏకంగా 37 కి.మీ. హైవే పనులకు ఓ ప్రజాపతినిధి భర్త చెరువు నీటిని తరలించారు. అధికార పార్టీవారి అక్రమ సంపాదనకు నీటిని వాడుకుంటున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. మూగజీవాల దాహార్తిని తీర్చమంటే అధికారులు స్పందిచకపోవడం దారుణమని అంటున్నారు.

లక్షకుపైగా జీవాలు

శింగనమల మండలంలో తీవ్ర వర్షాభావం కారణంగా గత ఏడాది పంటల సాగు తగ్గిపోయింది. దీంతో లక్షలాది మూగజీవాలకు మేత కొరత ఏర్పడింది. వేసవి కావడంతో ఎక్కడా పచ్చిక లేదు. ఎండు మోదులనే తింటూ జీవాలు ప్రాణలను నిలుపుకుంటున్నాయి. కొందరు గొర్రెల కాపరులు రూ.లక్షలు ఖర్చు చేసి మేత కొంటున్నారు. వేసవిలో కుంటలు, గుంతల్లో నీటిని జీవాలకు తాపేవారు. కొన్నిచోట్ల రైతులు వ్యవసాయ బోరు బావుల నీటిని ఇచ్చేవారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటలను సాగు చేయలేదు. శింగనమల చెరువులో నీరుంది. ఈ నీటిని మూగ జీవాల అవసరాలకు కొంత వదలాలని వారం క్రితం అధికారులకు గొర్రెల కాపరులు వినతిపత్రం సమర్పించారు. అయినా అధికారులు స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



ఉదయం 10గంటలకే నీడలో ఉన్న గొర్రెలు, మేకలు



మురుగు నీరే గతి..

నేను 30 సంవత్సరాల నుంచి గొర్రెల మందపై ఆధారపడ్డారు. అప్పుడప్పుడు మేత కొరత వచ్చేది. కానీ మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది నీరు కూడా లేదు. జీవాల దాహం తీర్చేందుకు ఇబ్బంది పడుతున్నాము. కాలువలో ఉన్న మురుగు నీటిని తాగుతున్నాయి. ఈ పరిస్థితిని చూస్తే బాధ కలుగుతోంది. మా కష్టాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

- చిరంజీవి, గొర్రెల కాపరి, శింగనమల



పట్టించుకోవడం లేదు

మా చెరువులో నీటిని రోడ్డు పనులకు అమ్ముకున్నారు. మూగజీవాలకు మాత్రం చుక్క నీరు వదలడం లేదు. కాలువలో బురద నీరు, మురుగునీటిని తాపుతున్నాము. వారం క్రితం అధికారులను కలిసి సమస్యను వివరించాము. 15 రోజులకు ఒకసారి చెరువు నీటిని కాలువలకు వదిలితే జీవాలకు నీటి సమస్య ఉండదని విన్నవించాము. అధికారుల నుంచి స్పందన రాలేదు. ప్రజా ప్రతినిధులకు నీటిని అమ్ముకోవడం పట్ల ఉన్న ఆసక్తి.. మూగ జీవాల దాహార్తిని తీర్చడంపట్ల లేదు.

- లక్ష్మిపతి, గొర్రెల కాపరి, శింగనమల



ఎక్కడా చుక్క నీరు లేదు..

మూగజీవాలు తాగడానికి ఎక్కడా చుక్క నీరు లేదు. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రోజుకు కనీసం రెండుసార్లు గొర్రెలకు నీరు తాపాలి. దిక్కుతోచక మురుగునీటిని తాపిస్తున్నాము. దీంతో జీవాలు అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలువలకు నీరు వదలాలి.

- చలమయ్య, గొర్రెల కాపరి, శింగనమల

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు


30 బైకుల స్వాధీనం

కదిరి, ఏప్రిల్ 11: పట్టణంలో పలు ద్విక్రవాహనాలను చోరీ చేసిన దొంగను అరెస్టు చేసి, 30 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ పుల్లయ్య తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక రాయచోటి రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూముకుంట గ్రామానికి చెందిన మామిళ్ల వీరారెడ్డి నంబరులేని ద్విచక్రవాహనంపై వచ్చాడన్నారు. అనుమానంతో విచారింగా ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడని, వెంటనే అదుపులోకి తీసుకుని వివరాల మేరకు అతడి వద్ద నుంచి 30 వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కదిరి టౌన్, రూరల్, గాండ్లపెంట, రాయచోటి పట్టణంలో 19 కేసులు అతడిపై నమోదైనట్లు చెప్పారు. నిందితుడిపై గతంలో అనంతపురం, తాడిపత్రిలో కూడా కేసులు నమోదైనట్లు తెలిపారు. వాహనాల విలువ రూ. 15లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. ఈ కేసును చేధించిన ఎస్‌ఐలు బలరాం, బాబ్‌జాన్, పూర్యానాయక్. శ్రీధర్, సిబ్బంది వేమనారాయణ, శంకర్‌రెడ్డి, రాజప్ప, గోవర్ధన్, చలపతి, వెంకటేశ్‌నాయక్, శివ, రాజేంద్రలను డీఎస్పీ శ్రీలత అభినందించారు.





వివరాలు వెల్లడిస్తున్న సీఐ పుల్లయ్య, స్వాధీనం చేసుకున్న వాహనాలు



ధర్మవరంలో ఈద్‌ముబారక్ తెలుపుకుంటున్న చిన్నారులు

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: రంజాన్ పర్వదిన వేడుకలను గురువారం పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లో ముస్లింలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో సైతం పెద్దఎత్తున పం డుగ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉదయమే స మీపంలోని ఈద్గా మైదానాలకు ర్యాలీగా వెళ్లి అక్కడ ముస్లిం మతపెద్దలు, ముతవల్లుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దానధర్మాలు, భక్తిశ్రద్ధలు, ఉపవాసాలకు ప్రతీక అయిన రంజాన్ పండగ గొప్పతనాన్ని మతపెద్దలు వివరించారు. అలాగే ఖుద్బా ప్రసంగం చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగ నం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. అదేవిధంగా మసీదుల్లో ప్రార్థనలు చేశారు. బంధుమిత్రుల ను ఇళ్లకు ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. ఈద్గామైదానాల వద్దకు పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



బుక్కపట్నంలో ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు



కదిరిలో ప్రార్థనలో పాల్గొన్న కందికుంట వెంకటప్రసాద్



ధర్మవరంలోని ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



పుట్టపర్తిలో..

టీడీపీలోకి 30 కుటుంబాల చేరిక



టీడీపీలో చేరినవారితో కందికుంట

తనకల్లు, ఏప్రిల్ 11: మండలంలోని తవళం పంచాయతీలో ఉన్న మార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి, కురమాలపల్లి, తవళం, గంగసానిపల్లి, గందోడివారిపల్లి నుంచి 30 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారంతా గురువారం కదిరిలోని ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయన సమక్షంలో పార్టీలోకి చేరారు. కందికుంట వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, రమణయ్య, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారంతా టీడీపీలోకి చేరారు. కందికుంట మాట్లాడుతూ కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరినవారిని తనకుటుంబ సభ్యులుగా చూసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్ రెడ్డి, నల్లం మాధవరెడ్డి, సురేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేది కూటమి ప్రభుత్వమే..

- ఆత్మీయ సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 11: రాష్ట్రంలో వచ్చేది ముమ్మాటికీ కూటమి ప్రభుత్వమేనని నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో గల సీఎస్‌బీ ఫంక్షన్‌హాల్లో గురువారం ఆయన ధర్మవరం పట్టణ, రూరల్ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. వైసీపీ పాలనలో మాదిరిగా అవినీతి, భూదందా, దౌర్జన్యాలు ఉండవన్నారు. చేనేతలు నిర్భయంగా.. సంతోషంగా వ్యాపారాలు కొనసాగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. రాష్ట్రంలో జగన్ అవినీతిపై ఉక్కుపాదం మోపడానికే బీజేపీ, టీడీపీ, జనసేన ఒక్కటయ్యాయని తెలిపారు. రాబోయేది ఊటమి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఉదయం నుంచి అన్ని వర్గాల ప్రజలు సత్యకుమార్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన గీతాంజలికి సన్మానం



గీతాంజలికి సన్మానం చేస్తున్న నాయకులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 11: మండలంలోని వలించెర్లోపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ, ఉమాదేవిల కుమార్తె గీతాంజలి గత నెలలో ఢిల్లీలోని మీరట్ యునివర్సిటీ నుంచి కీటక శాస్త్రంలో గౌరవ డాక్టరేట్ పొందారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ చేతుల మీదుగా ఆమె ఈ పట్టా పొందారు. ఉగాది పండగ సందర్భంగా స్వగ్రామానికి ఆమె వచ్చారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు గురువారం ఆమె ఇంటికి వెళ్లి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, సీపీఐ మండల కార్యదర్శి చాల్లా శ్రీనివాసులు, టీడీపీ నాయకులు అమరా చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న కళాకారుల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బెస్త శ్రీనివాసులు

ధర్మవరం, ఏప్రిల్ 11: వైసీపీ ప్రభుత్వం కళాకారులను పూర్తిగా విస్మరించిందని కళాకారుల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బెస్తశ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో గురువారం ఆయన కళాకారులు మోహన్ నాయుడు, శ్రీరాములతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కళలు అంతరించిపోవడం వల్ల ఎందరో కళాకారులు రోడ్డున పడ్డారన్నారు. రాజకీయ నాయకులు వారి సభలు, సమావేశాలు విజయవంతం చేయించుకోవడానికే కళాకారులను ఉపయోగించుకుంటున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ తోలు బొమ్మలాట, కీలుగుర్రాలు, చెక్కభజన, కోలాటం ప్రదర్శించే కళాకారులు ఉన్నారన్నారు. అంతరించిపోతున్న కళలను కాపాడాలని, గుర్తింపు పొందిన కళాకారులు రూ.6వేలు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో కళారంగానికి రూ.100 కోట్లు కేటాయించాలన్నారు. కళాకారులకు కాలనీ ఏర్పాటు చేసి అందులో గుడి, బడి కోసం మూడెకరాల స్థలం కేటాయించాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో గుజిరీ వ్యాపారి మృతి



మృతిచెందిన షేక్‌మస్తాన్‌వలి

ధర్మవరం, ఏప్రిల్ 11: పట్టణంలోని సంజయ్‌నగర్‌లో అనుమానాస్పద స్థితిలో గుజిరీ వ్యాపారి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన షేక్‌మస్తాన్‌వలి (48) గాంధీనగర్ సమీపంలో గుజిరీ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా గురువారం సాయంత్రం ఇంటిలోని బాత్‌రూంకు వెళ్లిన ఆయన ఎంతసేపటికి బయటకు రాలేదు. భార్య పర్వీన్ వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో ఆమె బోరున విలపించింది. సమాచారం అందుకున్న సీఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తర్వాత పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత మస్తాన్‌వలి అనారోగ్యంతో మృతిచెందాడా.. లేక హత్యకు గురయ్యాడా అన్నది తెలుస్తుందని సీఐ చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు షెక్షావలి ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

- టీడీపీ శ్రేణులకు మాజీమంత్రి పల్లె, ఎంపీ అభ్యర్థి బీకే పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 11: రానున్న ఎన్నికలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, హిందూపురం పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని వెంకటసాయి ఐటీఐ కళాశాలలో గురువారం వారు టీడీపీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. వైసీపీ పాలనలో అన్నివ్యవస్థలను జగన్‌రెడ్డి సర్వనాశనం చేసి, రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి భూదందాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. తాగునీటిని కూడా వదలకుండా వ్యవసాయతోటకు వదులుకున్న ఘనుడు శ్రీధర్‌రెడ్డి అని విమర్శించారు. ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పడానికి ప్ర జలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి చెందుతుందన్నా రు. తర్వాత బీకే పార్థసారథి మాట్లాడుతూ కూటమి పార్టీల్లోని ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలని, సమష్టిగా ముందుకు సాగి కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం అమడగూరు మండలంలోని జౌకలకు చెందిన రమణమ్మ, రవిగౌడ్ మరో ఐదు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. సమావేశంలో మండలకన్వీనర్ టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, జడ్పీటీసీ మాజీసభ్యుడు పిట్టా ఓబులరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కృష్ణమూర్తి,మాజీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు బొడ్డు జయన్న, పోగాకు జాకీర్, బడిశం రామాంజనేయులు, పీట్ల సుధాకర్, జెరిపిటి అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

పల్లె సింధూర ఎన్నికల ప్రచారం



మసకవంకపల్లిలో రోడ్డుషో చేస్తున్న పల్లె సింధూర, కృష్ణకిశోర్‌రెడ్డి

నల్లమాడ, ఏప్రిల్ 11: మండలంలోని మసకవంకపల్లి, మూలప్పగారిపల్లి, కురుమాల, గంగాపురం గ్రామాల్లో గురువారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి, ఆమె భర్తపల్లె వెంకటకృష్ణకిశోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. తొలుత మూలప్పగారిపల్లినుంచి గంగాపురం వరకు రోడ్డుషో నిర్వహించారు. మసకవంకపల్లిలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలందరికీ సంక్షేమపథకాలు సజావుగా అందేవన్నారు. వైసీపీ వచ్చాక కొందరికే పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించాలని పజల్ని కోరారు. చంద్రబాబు సీఎం అయితే మళ్లీ పథకాలు అందరికీ అందిస్తారని పేర్కొన్నారు. తర్వాత మిగతా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, వెంకటరమణనాయుడు, సుబ్బరాయుడు, రామచంద్ర, నారాయణస్వామి, నాగరాజు, సలీంబాషా, నిజాంవలీ, వేణుగోపాల్, గంగన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



ధర్మవరంలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్



కదిరిలో పూలే విగ్రహం వద్ద టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట నివాళులు

- వివిధ పార్టీలు, సంఘాల నాయకుల నివాళి

ధర్మవరం ఏప్రిల్11: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఆయన విగ్రహానికి కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌తో పాటు టీడీపీ, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యకుమార్ మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. కులవివక్ష నిర్మూలనకు ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీనాయకులు కాటమయ్య, సుధాకర్, పురుషోత్తంగౌడ్, చంద్రమోహన్‌బాబు, బొట్టుకిష్ట, రవీంద్ర, జింకల రాజన్న, సాయి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యూ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, నాయకులు రామకృష్ణనాయక్, రామాంజనేయులు, సకలచంద్రశేఖర్, పెద్దకోట్ల సురేశ్, దాసరినాగేంద్ర తదితరులు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వరయ్య, బలరాముడు, యజ్ఞన్న, బీకేముత్యాలప్ప, ఉరుకుందప్ప తదితరులు, మాజీఎమ్మెల్యే గోనుగుంట్ల వర్గీయులు డిష్‌రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, గొట్లూరుచంద్ర, తుంపర్తిపరమేశ్, దుస్సాక్రిష్ణసరితాల దస్తగిరి తదితరులు, ఎమ్మార్పీఎస్ నా యకులు బూదెప్ప, రామాంజినేయులు,బాబు,పవన్,పూజారిపెద్దన్న తదితరులు కూడా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూలేకు కందికుంట ఘన నివాళి

కదిరి/ కదిరి అర్బన్: పట్టణంలోని పూలే సర్కిల్‌లో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పూలే ఆశయాలు నేటి తరానికి ఆదర్శమన్నారు. సమాజంలో ఉన్న తారతమ్యాలను తొలగించి, మనుషులందరూ ఒక్కటే అని చాటి చెప్పిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ కార్యదర్శి చింతా నాగరాజు పూలే విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. బీఎస్పీ నాయకుడు గోవిందు , ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల సంఘం నాయకులు కూడా నివాళులర్పించారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

నల్లచెరువు, ఏప్రిల్ 11: మండలంలోని దామావాండ్లపల్లి గ్రామ సమీపంలో బావిలో పడి వృద్ధురాలు మృతి చెందింది. ఘటనపై ఎస్ఐ లింగన్న గురువారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. దామావాండ్లపల్లికి చెందిన పూలకుంట ఆదెమ్మ (68) బుధవారం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో కుమారుడు మల్లికార్జున గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే దామావాండ్లపల్లి సమీపంలో చింత తోపు వద్ద ఆమె చెప్పులు కనిపించాయని అదే గ్రామానికి చెందిన క్రిష్ణమ్మ తెలిపింది. వెంటనే కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి సమీపంలోని బావిలో వెతకగా, ఆమె మృతదేహం బయటపడింది. నెలరోజులక్రితం ఆమె కుక్క కాటుకు గురైందని, కాలి వేలుకు ఆపరేషన్ చేయించామని, అప్పటినుంచి మతిస్థిమితం సరిగ్గాలేదని కుమారుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరికి తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కేబుల్ చోరీపై ఫిర్యాదు

నల్లమాడ, ఏప్రిల్ 11: మండలంలోని బొగ్గలపల్లి గ్రామానికి చెందిన పెద్దన్న అనే రైతు పొలంలో కేబుల్ చోరీకి గురైంది. దీనిపై బాధిత రైతు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రైతు మాట్లాడుతూ తన పొలంలో నాలుగు స్తంభాలకు అమర్చిన కేబుల్ బుధవారం రాత్రి చోరీ అయిందన్నారు. అదే గ్రామానికి చెందిన నలుగురు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఇందులో ఇద్దరు వలంటీర్ల భర్తలు, ఒక వలంటీరు ఉన్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి, తమకు న్యాయం చేయాలని పెద్దన్న ఫిర్యాదులో పేర్కొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

పుట్టపర్తి, ఏప్రిల్ 11: మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు ప్రశాంతి గ్రామంలో గురువారం తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేశ్ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పూర్తిగా వెనుకపడిపోయిందన్నారు. మళ్లీ అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. ఇందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు ఎనుముల గంగాధర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి కౌన్సిలర్ రాజీనామా



కౌన్సిలర్ లక్ష్మణ్‌తో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు పుల్లయ్య

పుట్టపర్తి, ఏప్రిల్ 11: పుట్టపర్తి మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ లక్ష్మణ్ వైసీపీకి రాజీనామా చేసినట్టు గురువారం ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ కౌన్సిలర్‌గా గెలిచి రెండున్నర సంవత్సరాలైనా.. తన వార్డులో ఎలాంటి అభివృద్ధి చేయలేక పోయానన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల జగన్ పాలనలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. దీంతో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 13వ తేదీన 5వేల మందితో స్థానిక సత్యమ్మ ఆలయం వద్ద టీడీపీలోకి చేరుతున్నట్టు పేర్కొన్నారు. వేలాదిమంది యువతతో కలిసి టీడీపీలోకి చేరనుండడంతో ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య కౌన్సిలర్‌తో సమావేశమయ్యారు. మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సమక్షంలో లక్ష్మణ్ టీడీపీలోకి చేరనున్నట్టు చెప్పారు.

టీడీపీలోకి 15 కుటుంబాలు చేరిక



టీడీపీలో చేరినవారితో మాజీ మంత్రి పల్లె

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 11: మండలంలోని ఎద్దువారిపల్లికి చెందిన 15 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లాకేంద్రంలోని టీడీపీకార్యాలయంలో గురువారం వారు మాజీ మంత్రిపల్లె రఘునాథరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో సుధాకర్ నాయక్, బీమానాయక్, గంగరాజు, సుధార్‌నాయక్, దశర్థనాయక్, ప్రసాద్‌నాయక్, రాజునాయక్, వెంకటేష్‌నాయక్, సునంద తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలున్నారు.

బాలకృష్ణ పర్యటనకు తరలిరండి

నల్లచెరువు, ఏప్రిల్ 11: హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ 13వ తేదీ శనివారం కదిరిలో పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సైకిల్ రావాలి అనే కార్యక్రమంలో భాగంగా ఆయన కదిరికి వస్తున్నట్లు చెప్పారు. తొలుత ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొంటారన్నారు. అనంతరం మదనపల్లి రోడ్డులోని పీవీఆర్ ఫంక్షన్‌లో గిరిజనులతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. తర్వాత జీవి మాను సర్కిల్‌వరకు ర్యాలీ ఉంటుందని, అక్కడ సభ నిర్వహిస్తారని పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

ప్రజా సమస్యలను గుర్తించండి

బత్తలపల్లి, ఏప్రిల్ 11: మండలంలోని గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలను గుర్తించాలని టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, బీజేపీ మండల ఇన్‌చార్జి లలిత్ కుమార్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యలయంలో గురువారం వారు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, సెక్షన్ ఇన్‌చార్జిలు , గ్రామ కమిటీ అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాలలో తిరిగి ప్రజల సమస్యలను గుర్తించాలన్నారు. అలాగే అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు రాని వారిని గుర్తించాలన్నారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే సమస్యల్ని పరిష్కరిస్తామని భరోసా కల్పించాలన్నారు. కూటమి అభ్యర్థి సత్యకుమార్ అనే విషయాన్ని ప్రజలకు తెలియ జేయాలని వారు సూచించారు.

సెల్‌టవర్ బ్యాటరీల చోరీ

గోరంట్ల, ఏప్రిల్ 11: మండలంలోని జాతీయ రహదారిపై పుల్లగూర్లపల్లి వద్ద ఉన్న ఎయిర్‌టెల్, జియో, ఐడియా అనుబంధంగా ఉన్న సెల్ టవర్‌కు చెందిన 24 బ్యాటరీలు బుధవారం రాత్రిచోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు షెడ్‌కు ఏర్పాటు చేసిన రేకులను కత్తిరించి వాటిని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. దాదాపు రూ.48వేలు విలువ చేసే బ్యాటరీల చోరీ జరిగినట్లు చెప్పారు. మేనేజర్ చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

ఉచిత సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోండి

మడకశిర రూరల్, ఏప్రిల్ 11: శ్రీరామనవమి పండుగ సందర్భంగా మండలంలోని నీలకంఠాపురం దేవాలయంలో దివంగత శ్రీరామిరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించే ఉచిత సామూహిక వివాహాల కోసం అసక్తిగల వారు ఈ నెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వధువుకు 18 ఏళ్లు, వరుడికి 21 ఏళ్లు నిండి ఉండాలన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పాటు, వధూవరుల ఫొటోలు, ఆధార్ కార్డు ను దర ఖాస్తుకు జతపరచాలన్నారు. ఈ వివాహ వేడుకలకు ముఖ్య అతిథులుగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన నంజావధూత స్వాములు వస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆసుపత్రిలో రోగులకు మజ్జిగ పంపిణీ

గోరంట్ల, ఏప్రిల్ 11: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఉపాధ్యాయుడు జగదీశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. డాక్టర్ వినోద్‌కుమార్ పంపిణీ ప్రారంభించారు. ఎండలు మండుతుండడంతో వేసవి ఉపశమనం కోసం సత్యసాయి బాబా భక్తుల ఆర్థికసాయంతో వందమందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు దేవాంగం జగదీశ్వర్ తెలిపారు.

బాధితులకు బీకే పరామర్శ



లక్ష్మీనరసప్పను పరామర్శిస్తున్న బీకే పార్థసారథి

గోరంట్ల, ఏప్రిల్ 11: వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన దళితుడు గౌనివారిపల్లి లక్ష్మీనరసప్ప, ఆయన భార్య నాగమణి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి శుక్రవారం పరామర్శించారు. ఉగాది సందర్భంగా గౌనివారిపల్లిలో జరిగిన వేడుకల్లో ఘర్షణ పడిన వైసీపీ నాయకులు... టీడీపీకి చెందిన లక్ష్మీ నరసప్ప దంపతులపై దాడిచేసి గాయపరిచిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న బీకే హిందూపురం ఆసుపత్రికి వెళ్లి బాధితులకు ధైర్యం చెప్పారు. తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం గోరంట్ల మండలానికి చెందిన ఐటీడీపీ కార్యకర్త జక్కసముద్రం కుమార్ మిద్దెపైనుంచి ప్రమాదవశాత్తు పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అతడిని పరామర్శించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు కొత్తపల్లి నరసింహప్ప, అశ్వత్థరెడ్డి, నీలకంఠారెడ్డి, బెల్లాల చెరువుచంద్ర, తిరుపాల్, నాగభూషణ తదితరులున్నారు.

బైకు ఢీకొని మహిళకు గాయాలు

పరిస్థితి విషమం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 11: పట్టణ పరిధిలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట గురువారం ద్విచక్రవాహనం ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పట్టణపరిధిలోని మారెమ్మగుడి ప్రాంతానికి చెందిన అంజనమ్మ అనే మహిళ మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డు పక్కన నడిచి వెళ్తోంది. అయితే రహమత్‌పురానికి చెందిన యువకుడు సాధిక్ అదే దారిలో ద్విచక్రవాహనంలో వెళ్తూ వెనుకనుంచి ప్రమాదవశాత్తు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి ఆమెను వెంటనే ఆటోలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ చక్రధర్ పరిశీలించి ఆమె తలకు బలమైన గాయాలయ్యాయని, ముక్కులో నుంచి రక్తం వస్తోందని తెలిపారు. దీంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను బెంగళూరుకు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అతి వేగమే ప్రమాదానికి కారణమని పలువురు అంటున్నారు. దీనిపై అంజనమ్మ బంధువులు ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి...

రొద్దం, ఏప్రిల్ 11: మండలంలోని ఆర్ మరువపల్లి సమీపంలో గురువారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆర్ మరువపలి పెట్రోల్ బంకులో పనిచేసే రవి గురువారం మధ్యాహ్నం మండలకేంద్రమైన రొద్దంలోని ఓ హోటల్ నుంచి భోజనం తీసుకొని ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అయితే పావగడవైపు నుంచి వచ్చే గుర్తు తెలియని కారు మరువపల్లి సమీపంలోని బ్రిడ్జిపై ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రవి బ్రిడ్జి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి కాలు విరిగింది. తలకు బలమైన గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి అతడిని రొద్దం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్య కోసం హిందూపురానికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్టు రొద్దం పోలీసులు తెలిపారు.

మరో యువకుడికి...

గోరంట్ల, ఏప్రిల్ 11: మండలంలోని హిందూపురం రహదారిలో గుమ్మయ్యగారిపల్లి విలాస్ వద్ద గురువారం జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో మున్వర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గోరంట్లలోని కొలిమి చింతమానువీధిలో ఉంటున్న అన్వర్‌సాబ్ కుమారుడు మున్వర్ ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడి కుడి చేయి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. గోరంట్ల ప్రభుత్వ ఆసుప్రతిలో ప్రథమచికిత్స అనంతరం ప్రత్యేక వాహనంలో మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

నల్లచెరువు, ఏప్రిల్ 11: మండలంలోని దామావాండ్లపల్లి గ్రామ సమీపంలో బావిలో పడి వృద్ధురాలు మృతి చెందింది. ఘటనపై ఎస్ఐ లింగన్న గురువారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. దామావాండ్లపల్లికి చెందిన పూలకుంట ఆదెమ్మ (68) బుధవారం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుమారుడు మల్లికార్జున గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే దామావాండ్లపల్లి సమీపంలో చింత తోపు వద్ద ఆమె చెప్పులు కనిపించాయని అదే గ్రామానికి చెందిన కిష్టమ్మ తెలిపింది. వెంటనే కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి సమీపంలోని బావిలో వెతకగా, ఆమె మృతదేహం బయటపడింది. నెలరోజులక్రితం ఆమె కుక్క కాటుకు గురైందని, కాలి వేలుకు ఆపరేషన్ చేయించామని, అప్పటినుంచి మతిస్థిమితం సరిగ్గాలేదని కుమారుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరికి తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.



మడకశిర ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలకు తరలివచ్చిన ముస్లింలు



చిలమత్తూరులో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



గోరంట్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఈద్గా మైదానాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ముస్లింల ప్రముఖ పండుగ రంజాన్‌ను గురువారం భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. మహ్మద్ ప్రవక్త చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని మౌలానా అబ్దుల్ మన్నాన్ పేర్కొన్నా రు. ఈద్-ఉల్-ఫితర్‌ను పురస్కరించుకుని ఉదయం స్థానిక అల్ హిలాల్ ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భం గా ముస్లిం మతపెద్దలు రంజాన్ విశిష్టతను, మహ్మద్ ప్రవక్త సందేశాన్ని వినిపిం చారు. అలాగే పట్టణంలోని గడ్డమీద, మేళాపురం, మోడల్ కాలనీ తదితర చోట్ల ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలిపారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. టీడీపీ నాయకులు ప్రార్థ నల్లో పాల్గొని ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు. మడకశిర పట్టణంలో ముస్లింలు ర్యాలీగా ఈద్గా మైదానం వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించారు. పెనుకొండ పట్టణంతో పాటు మండలంలోని గుట్టూరు, తిమ్మాపురం, నాగలూరు, శెట్టిపల్లి గ్రామాల్లో రంజాన్ వేడులను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా మైదానా ల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా గోరంట్ల, చిలమత్తూరు, అమరాపురం, అగళి తదితర మండలకేంద్రాల్లో, కర్ణాటకలోని పావగడ ఈద్గా మైదానాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమరాపురంలో రంజాన్ వేడుకల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా మైదానంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, ముస్లింలకు స్వీట్లు పంచిపెట్టారు. టీడీపీ గుట్టూరు, గోరంట్లలో ప్రార్థనలు చేసి వస్తున్న ముస్లింలకు ఎమ్మెల్యే అభ్యర్థి సవిత రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



గోరంట్లలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న అభ్యర్థి సవిత





అగళి, గుట్టూరులో ఈద్గా మైదానానికి వెళ్తున్న ముస్లింలు



పావగడలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అమరాపురంలో రంజాన్ వేడుకల్లో సునీల్‌కుమార్

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

రొళ్ల, ఏప్రిల్ 11: అన్ని విధాలా బీసీలను అభివృద్ధికి పాటు పడింది తెలుగుదేశం పార్టీయేనని, వైసీపీ పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఎం రాయపురంలో గురువారం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న తదితరులు హాజరయ్యారు. ముందుగా గ్రామంలో అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సునీల్‌కుమార్ మాట్లాడుతూ... ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో సీఎం జగన్ బీసీల సంక్షేమం, అభివృద్ధిని మరిచిపోయారన్నారు. గతంలో టీడీపీ స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తే, దానిని సీఎం జగన్ 24 శాతానికి తగ్గించారన్నారు. బీసీల కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం మినహా ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నారా చంద్రబాబునాయుడు బీసీలను అన్ని విధాలా ఆదుకుంటారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంరాయాపురం, చర్లోపల్లి, గొల్లహట్టి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ భవిషత్తు గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప, మాజీ సర్పంచులు పాండురంగప్ప, చిక్కన్న, నన్నమారేగౌడ్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేష్, సీనియర్ నాయకులు జయరామిరెడ్డి, చంద్రప్ప, రాజప్ప, తిప్పేస్వామి, రవికుమార్, చిదానంద, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి పాటుపడిన పూలే

పలువురి ఘననివాళి



హిందూపురంలో నివాళులర్పిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 11: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని పలువురు కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని బెంగళూరు రోడ్డులో సూగూరు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పలువురు పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మడకశిరటౌన్: బడుగుల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావుపూలే చేసిన సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అమరాపురం బస్టాండు ఆవరణంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మడకశిరలో నివాళులర్పిస్తున్న గుండుమల తిప్పేస్వామి

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీకే, సవిత



చౌడేశ్వరీకాలనీలో ప్రచారం చేస్తున్న పార్థసారథి, సవిత

గోరంట్ల, ఏప్రిల్ 11: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన యేడాదిలోగా మండలకేంద్రంలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ప్రజలకు హామీ ఇచ్చారు. గోరంట్ల పంచాయతీలోని కసిరెడ్డిపల్లి, తిప్పరాజుపల్లి, ఆంజనేయస్వామి కాలనీ, చౌడేశ్వరీ కాలనీల్లో సవిత గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చౌడేశ్వరీ కాలనీలో ఎన్నికల ప్రచారంలో బీకే పాల్గొని మాట్లాడారు. చేనేత కార్మికులకు గతంలో అందిస్తున్న రాయితీ పథకాలను వైసీపీ రద్దు చేసిందని, టీడీపీ మరల పునరుద్ధరిస్తుందన్నారు. సత్యసాయి వాటర్ ప్రాజెక్టుకు అనుబంధంగా 2017-18లో రూ. 14కోట్లతో పనులు ప్రారంభిచినా ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ చేతకాని తనం వల్ల పనులు జరగలేదన్నారు. అలాగే రూ.320కోట్లతో గొల్లపల్లి రిజర్వార్‌నుంచి గోరంట్లకు తాగునీటి కోసం నిధులు మంజూరు చేశారన్నారు. టెండర్ దశలో ఉండగా పనులు ఆగిపోయాయన్నారు. పనులు పూర్తి చేస్తామని యువగళం యాత్రలో నారాలోకేశ్ హామీ ఇచ్చారని తెలిపారు. రోడ్ల అభివృద్ధికి రూ.53కోట్లు తేస్తే కేవలం రూ.10కోట్ల నిధులు ఖర్చుకాగా, మిగిలిన గ్రామీణ రోడ్లు ఆగిపోయాయన్నారు. ఇప్పటికే సీఎం జగన్ ప్రభుత్వ ఆస్తులన్నీ అమ్మేసి, ప్రజలపై రుణభారం పెంచారన్నారు. టీడీపీ నాయకులు కక్కుల రఘునాథ్‌రెడ్డి, నిమ్మల విద్యా,ధరిణి, నిమ్మల చంద్రశేఖర్, నిమ్మల యువశేఖర్, కొత్తపల్లి నరసింహప్ప, అశ్వ త్థరెడ్డి సుధాకర్‌రెడ్డి, బెల్లాలచెరువు చంద్ర, నీలకంఠారెడ్డి, గిరి, సుబ్రమణ్యం, నరేష్, బాలక్రిష్ణచౌదరి, నారాయణ, జయరాం జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యుల కోసం పడిగాపులు..!

పురం దంత వైద్య చికిత్సాలయం వద్ద రోగుల నిరీక్షణ



హిందూపురం ప్రభుత్వాసుపత్రి

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 11: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి అంటేనే నిర్లక్ష్యానికి నిదర్శనం అన్న విధంగా తయారైందని ఆసుపత్రికి వచ్చిన రోగులు ఆవేదన చెందుతున్నారు. ఉదయమే ఆసుపత్రికి వచ్చినా సమయానికి వైద్యులు రాకపోవడం తో నిరీక్షించి నీరసించి పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. వైద్యులు వస్తారో రారో కూడా తెలియని పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. ఎవరిని అడగాలో తెలియదన్నారు. వైద్యుడు వస్తాడని ఎదురు చూస్తున్నామని పేర్కొ న్నారు. హిందూపురం దంత వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రిలోని దంత చికిత్సాలయానికి గురువారం ఉదయం కొంత మం ది వచ్చారు. అయితే ఉదయం 11 గంటలైనా వైద్యులెవరూ రాలేదు. దీంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన రాములమ్మకు దంతాలు ఊగుతున్నాయి. కొద్దిరోజుల కిందట ఆమె ఆసుపత్రికి వస్తే వైద్య పరీక్షలు చేసి గురువారం రమ్మన్నారు. తీరా ఇక్కడికి వస్తే వైద్యులు లేరు. అదే విధంగా హిందూపురం ధర్మపురం ప్రాంతానికి చెందిన మహ్మద్ అనే వ్యక్తికి దవడలు వాచిపోయాయి. పండుగపూట నమాజ్ చదువుకుని నేరుగా ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. ఎంత సేపు వేచిచూసినా వైద్యుడు రాలేదు. శ్రీకంఠపురానికి చెందిన మంజునాథ్ పంటి నొప్పితో చాలా బాధ పడుతున్నాడు. వైద్యులు వచ్చి ఏదైనా చికిత్సలు చేస్తారని, తన బాధను తగ్గిస్తారని ఎదురు చూస్తున్నాడు. అయితే బాధితులను పట్టించుకునే వారే లేరు. అయినా వారు మధ్యాహ్నం వరకు అక్కడే నిరీక్షస్తూ కూర్చుండి పోయారు.

కూలి పని వదులుకుని వచ్చా..

కొంత కాలంగా పండ్లు ఊగుతున్నాయి. ఇంతకు ముందు వచ్చా. పరీక్షించి గురువారం రమ్మన్నారు. ఆర్యోగం ముఖ్యమని కూలి పని కూడా వదులుకుని వచ్చా. తీర ఇక్కడకు వస్తే వైద్యుడు లేరు. **- రాములమ్మ, శ్రీరంగరాజుపల్లి**

ఇలా అయితే ఎలా?

నాకు పంటి సమస్యతో దవడ మొత్తం వాచింది. నొప్పి భరించలేకున్నాను. ఉదయం నమాజు చదువుకుని నేరుగా ఆసుపత్రికి వచ్చా. ఉదయం 11 గంటలైనా వైద్యులు రాలేదు. ఇంత నిర్లక్ష్యమైతే ఎలా. **- మహ్మద్, ధర్మపురం, హిందూపురం**



దంత వైద్య చికిత్సాలయం వద్ద వైద్యుడి కోసం వేచి ఉన్న రోగులు

కోడ్ అమలుపై అధికారుల నిర్లక్ష్యం



కదిరేపల్లి సచివాలయంపై ఉన్న సీఎం బొమ్మ

మడకశిర రూరల్, ఏప్రిల్ 11: ఎన్నిల కోడ్ అమలు చేయడంపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ జెండాలు, రంగులు, నాయకుల విగ్రహాలు, గుర్తులు, పేర్లు ఇలా ఓటర్లను ప్రభావితం చేసేవి ఏవీ బహిరంగంగా కనిపించకూడదని ఎన్నిల సంఘం నిర్దిష్ట ఆదేశాలు జారీ చేసింది. అయితే మండలంలోని పలు బహిరంగ ప్రదేశాల్లో అవి కనిపిస్తున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు. వీటిని అధికారులు నిర్లక్ష్య వైఖరితో వదిలివేస్తున్నారని స్థానికులు పలువురు అంటున్నారు. మండలంలోని కదిరేపల్లి సచివాలయం, రైతుభరోసా కేంద్రంపై సీఎం బొమ్మతోపాటు నవరత్నాల పథకాలకు సంబంధించిన బొమ్మలు గొడలపై అలాగే ఉన్న అధికారలు పట్టించుకోవడం లేదు. అదే విధంగా సీ కోడిగేపల్లి సచివాలయం పక్కనే పీఎం, సీఎం పేర్లకు సంబంధించిన బోర్డు ఉన్నాయి. రైతు భరోసా కేంద్రానికి పార్టీ రంగు అలాగే ఉంది. వారం రోజుల కిందట ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్థానిక అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల కోడ్, ఎన్నికల నియమావళిపై వివరించారు. దీంతో కొంత మంది అధికారులు చురుకుగా వాటిని అమలుచేస్తున్నారు. మరికొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.



సి-కొడిగేపల్లి సచివాలయం పక్కనే పీఎం, సీఎం పేర్లు ఉన్న బోర్డు



సి-కొడిగేపల్లిలో రంగుమారని రైతు భరోసా కేంద్రం



కదిరేపల్లి రైతుభరోసా కేంద్రంపై నవరత్నాల పథకాలతో సీఎం బొమ్మ

పింఛన్ సొమ్ము పెంచుతాం: టీడీపీ

రొద్దం, ఏప్రిల్ 11: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే వచ్చే జూలై నెల నుంచి ప్రతి నెలా అవ్వా తాతలకు నెలకు రూ. 4 వేలు పింఛన్ అందిస్తామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. రొద్దం మండల పరిధిలోని బీఆర్ కొట్టాల, దొడఘట్ట, వైటీ రెడ్డిపల్లి, రంగాపురం తదితర గ్రామాల్లో గురువా రం టీడీపీ మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే దొడఘట్ట హరిజన వాడలోని రెండో వీధిలో సీసీ రోడ్డుపై గుంటలా ఏర్పడి కంపుకొడుతున్న మురుగునీటిని గమనించారు. అభివృద్ధి అంటే ఇదేనా అని వైసీపీని ప్రశ్నించారు. హరిజన వాడలోని మురుగు కాలువలను ఏడాదిగా శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహులు, జీవీపీ నాయుడు, చిన్నప్పయ్య, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు రుణం తీర్చుకోవాలి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 11: కరువు నేలలో అంతర్జాతీయ కియత కార్ల పరిశ్రమను నెలకొల్పి ప్రతి ఇంటా వెలుగులు నింపిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రుణం తీర్చుకోవాలని టీడీపీ నాయకులు కేశవయ్య, గుట్టూరు చిన్న వెంకటరాముడు, జిల్లా అధికార ప్రతినిధి రఘువీర చౌదరి తదితరులు ప్రజలను కోరారు. మండలంలోని మునిమడుగు, అమ్మవారిపల్లి, చిన్నపరెడ్డిపల్లిల్లో శుక్రవారం టీడీపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

నేటి బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

అగళి, ఏప్రిల్ 11: నియోజకవర్గ కేంద్రమైన మడకశిరలో శుక్రవారం ఎమ్మె ల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మడకశిరలోని వాల్మీకి విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు బైకులతో తరలిరావాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో గుజిరీ వ్యాపారి మృతి

ధర్మవరం, ఏప్రిల్ 11: పట్టణంలోని సంజయ్‌నగర్‌లో అనుమానాస్పద స్థితిలో గుజిరీ వ్యాపారి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన షేక్‌మస్తాన్‌వలి (48) గాంధీనగర్ సమీపంలో గుజిరీ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా గురువారం సాయంత్రం ఇంటిలోని బాత్‌రూంకు వెళ్లిన ఆయన ఎంత సేపటికి బయటకు రాలేదు. భార్య పర్వీన్ వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో ఆమె బోరున విలపించింది. సమాచారం అందుకున్న సీఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తర్వాత పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత మస్తాన్‌వలి అనారోగ్యంతో మృతిచెందాడా.. లేక హత్యకు గురయ్యాడా అన్నది తెలుస్తుందని సీఐ చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు షెక్షావలి ఉన్నారు.

సెల్‌టవర్ బ్యాటరీల చోరీ

గోరంట్ల, ఏప్రిల్ 11: మండలంలోని జాతీయ రహదారిపై పుల్లగూర్లపల్లి వద్ద ఉన్న ఎయిర్‌టెల్, జియో, ఐడియా అనుబంధంగా ఉన్న సెల్ టవర్‌కు చెందిన 24 బ్యాటరీలు బుధవారం రాత్రిచోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు షెడ్‌కు ఏర్పాటు చేసిన రేకులను కత్తిరించి వాటిని ఎత్తుకెళ్లినట్లు తెలిపా రు. దాదాపు రూ.48వేలు విలువ చేసే బ్యాటరీల చోరీ జరిగినట్లు చెప్పారు. మేనేజర్ చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బ రాయుడు తెలిపారు.